క్లుప్తంగా

సైనిక సంక్షేమానికి డ్వాక్రా మహిళల విరాళం



మున్సిపల్ సీపీ, కమిషనర్లకు డీడీ అందిస్తున్న మెప్మా అధికారులు

గుంతకల్లుటౌన్: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ సైనికులు, యుద్ధంలో వీరమరణం పొందిన వారి కుటుంబసభ్యుల సంక్షేమానికై గుంతకల్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.26,600 విరాళాన్ని అందజేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, కమిషనర్ మల్లికార్జున చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారికి డీడీని అందజేశారు. సైనిక సంక్షేమానికి తమవంతు సహకారమందించిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం.భవాని, మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, సీఓలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



రిజర్వాయర్‌లో నీటినిల్వను పరిశీలిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె నేపథ్యంలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అధికారులు, రెగ్యులర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ ఇంజినీర్ గురప్పయాదవ్‌తో కలిసి ఆయన ఎస్ఎస్. ట్యాంకులో నీటి నిల్వలు, ఫిల్టర్‌బెడ్స్, భాగ్యనగర్ ఈఎల్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించారు. నిర్ణీత వార్డులకు క్రమంగా నీటి సరఫరా జరగాలని ఆయన ఆదేశించారు. ఏఈ హరికృష్ణ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10 లక్షలు విడుదల చేయించారు. గ్రామంలోని పాత పాఠశాల ఎదుట నుంచి ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీపీ కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు బేడల వెంకట్రాముడు, టెంకాయల నారాయణ, వెంకట్రామరెడ్డి, తిమ్మప్ప, బేడల రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



చుక్కలూరు వెంకట్రామిరెడ్డిని పరామర్శిస్తున్న భీమిరెడ్డి

పామిడి: ఎద్దులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చుక్కలూరు వెంకట్రామిరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి(26) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి తనయుడు, పార్టీ యువనేత వై భీమిరెడ్డి, జిల్లా కబడీ అసోసియేషన్ అధ్యక్షుడు సీబీ మంజునాథ్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాసరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: కుటుంబ కలహాలతో పట్టణంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అర్బన్ ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. భగత్‌సింగ్ నగర్‌కు చెందిన శివశంకర్ రెడ్డి(45) మార్కెట్ యార్డులో హోటల్ నిర్వహిస్తున్నాడు. అతడు తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికొచ్చి భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. గురువారం రాత్రి ఇంట్లో గొడవపడ్డాడు. అనంతరం మార్కెట్‌యార్డులోని హోటల్‌లోకి వెళ్లి పైకప్పునకు ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల చెంతకు పోలీసు సేవలు

- ఫలించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృషి
- ఒకే పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోకి శింగనమల నియోజకవర్గం
- ప్రజలకు తప్పిన వ్యయప్రయాసలు
- ఆరు మండలాల ప్రజలకు అనుకూలం



బుక్కరాయసముద్రం సర్కిల్ పోలీస్‌స్టేషన్

శింగనమల: విసిరేసినట్టుగా దిక్కుకొక పోలీస్ సబ్ డివిజన్ .. సర్కిల్ స్టేషన్‌తో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న శింగనమల నియోజకవర్గ ప్రజలకు ఊరట కలిగింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దంపతుల కృషి ఫలితంగా ఒకే పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోకి నియోజకవర్గం రావడంతో ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువయ్యాయి. ప్రజలకు వ్యయప్రయాసలు తప్పాయి. వివరాల్లోకెళితే.. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి, నియోజకవర్గంలోని మండలాలన్నీ ఒక్క సర్కిల్ పరిధిలో ఉండేవి కావు. ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులు ఎవరూ దీని మీద దృష్టి పెట్టలేకపోయారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మరోవైపు పోలీసులకు శాంతిభద్రతల పరిరక్షణలో సవాళ్లు ఎదురయ్యేవి. నియోజకవర్గంలో శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాలున్నాయి. గతంలో శింగనమల, నార్పల, బుక్కరాయసముద్రం మండలాలు ఇటుకలపల్లి సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండేవి. గార్లదిన్నె మొదట అనంతపురం రూరల్, తర్వాత ఆత్మకూరు సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండేది. పుట్లూరు, యల్లనూరు మండలాలు తాడిపత్రి రూరల్ సర్కిల్‌లో ఉండేవి. ఈ రెండు మండలాలు తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలో ఉండేవి. ఇక మిగిలిన నాలుగు మండలాలు అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో ఉండేవి. బుక్కరాయసముద్రం మండలం పసులూరు, పి.కొత్తపల్లి, నార్పల మండలం దుర్గం గ్రామం ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండేవి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు.

ఎమ్మెల్యే దంపతుల చొరవ...

ఈ సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్‌సర్కిల్ కార్యాలయంగా చేయించారు. శింగనమల, గార్లదిన్నె, నార్పల మండలాలకు శింగనమలలో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయించారు. పుట్లూరు, యల్లనూరు మండలాలకు పుట్లూరులో సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యేలా కృషి చేశారు. బుక్కరాయసముద్రం సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి పసులూరు, పి.కొత్తపల్లిని, దుర్గం గ్రామాన్ని నార్పల పోలీస్ స్టేషన్‌పరిధిలోకి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలను నూతనంగా ఏర్పాటైన అనంతపురం రూరల్ సబ్ డివిజనల్‌లోకి కలిసేలా కృషి చేశారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గిపోయాయి.

శింగనమల నియోజకవర్గ వివరాలు..

మండలం	గ్రామాలు	జనాభా	ఈ ఏడాది నమోదైన కేసులు
శింగనమల	40	44,859	187
గార్లదిన్నె	36	56,418	233
నార్పల	36	59,958	197
బుక్కరాయి సముద్రం	38	70,045	335
పుట్లూరు	40	39,238	137
యల్లనూరు	36	34,332	112
మొత్తం	226	3,04,850	1,201

అందుబాటులోకి పోలీసు సేవలు



నియోజకవర్గంలో పోలీస్ సేవలు అందుబాటులో ఉండేవికావు. సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు పోవాలటే ఎంతో ఇబ్బంది పడేవారు. దీంతో నియోజకవర్గంలో మూడు సర్కిల్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ప్రజలందరికీ పోలీస్ సేవలు అందుతున్నాయి. మరోవైపు పోలీసులకు విధి నిర్వహణ సులువుగా మారింది.

– ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

సర్కిల్ కార్యాలయం ఏర్పాటు సంతోషకరం



గతంలో గార్లదిన్నె మండలం వారు సర్కిల్ పోలీస్ స్టేషన్ కోసం ఆత్మకూరుకు పోవాల్సి ఉండేది. అనంతపురం వెళ్లి అక్కడి నుంచి ఆత్మకూరుకు వెళ్లేవారం. ప్రస్తుతం గార్లదిన్నె, నార్పల మండలాలకు మధ్యలోనున్న శింగనమలలో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

– చీమల కొండా, కల్లూరు, గార్లదిన్నె మండలం

వ్యయప్రయాసలు తప్పాయి



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చొరవతో శింగనమల, బుక్కరాయసముద్రం, పుట్లూరులో సర్కిల్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. అలాగే నియోజకవర్గమంతా ఒకే సబ్ డివిజన్‌లోకి వచ్చింది. దీంతో ప్రజలకు వ్యయ ప్రయాసలు తప్పాయి. పోలీసులకు పని సులభతరమైంది.

– నీలం భాస్కర్, బీకేఎస్ జెడ్పీటీసీ సభ్యుడు

స్పందన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి



కొత్తపేట సర్వే నంబర్ 431లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

గుత్తి రూరల్: స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని గుంతకల్లు ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి తహసీల్దార్ మహబూబ్‌బాషాను ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే స్పందన వినతులు, సచివాలయ సేవలపై తహసీల్దార్ మహబూబ్ బాషాను విచారించారు. రైతులకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. అనంతరం కొత్తపేట గ్రామ శివారులోని జగనన్న కాలనీలను పరిశీలించారు. సర్వే నంబర్ 431లోని ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. వీఆర్ఓ పవిత్ర, సర్వేయర్లు శేషసాయి, హాజీవలి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణంలోని ఉప్పరవీధికి చెందిన నాగరాజు రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



యూటీఎఫ్ కాల్యెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు మోడల్ బుక్స్ పంపిణీ చేయాలని, అందుకు అవసరమైన ఆర్థికసాయం అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యూటీఎఫ్ నాయకులకు తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామయ్య, నాయకులు చెన్నారెడ్డి, శ్రీరాములు, నాగన్న, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, అనిల్, నారాయణస్వామి, బాలక్రిష్ణ, శివకుమార్, రమణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే మహిళా సాధికారత



డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న చైర్‌పర్సన్ లిఖిత

తాడిపత్రి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే మహిళా సాధికారత సాకారమవుతోందని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకు ఆవరణలో డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.1,12,00,000 మెగా చెక్కు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అడుగులోనూ మహిళలకు సీఎం జగన్ ఓ అన్నలా అండగా నిలబడుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మహిళలను నమ్మించి మోసం చేస్తే సీఎం వైఎస్ జగన్ వారిని ఆదుకున్నారన్నారు. కరోనా పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో ప్రతి ఇంటిలో పొయ్యి వెలిగిందంటే సీఎం వైఎస్.జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కారణమన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అనేక అవకాశాలు కల్పిస్తున్న మనసున్న మహారాజు సీఎం వైఎస్.జగన్ అని పేర్కొన్నారు. బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ, బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. తాడిపత్రి ఏడీసీసీ బ్యాంకు అధికారి వై.అనిల్‌కుమార్‌రెడ్డి, నోడల్ అధికారి జి.మనోహర్, బ్రాంచి మేనేజర్ జె.ఉమారాణి, అసిస్టెంట్ మేనేజర్లు పి.భవాని, ఎస్.రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చెన్నప్ప.

యాడికి: 40 ఏళ్ల జేసీ సోదరుల పాలనలో జరగని అభివృద్ధి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలోనే జరిగిందని వైస్ ఎంపీపీ చెన్నప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల టీడీపీ నేతలు మాట్లాడుతూ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సూచించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మండలంలోని ప్రతి పంచాయతీలో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయన్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించడంతోపాటు రాయలచెరువు చెరువును నాలుగుసార్లు నీటితో నింపడం, యాడికి కాలువకు ఏటా నీరు ఇచ్చిన ఘనత పెద్దారెడ్డికే దక్కుతుందన్నారు. యాడికి కాలువ గుండా నీరు పారటంతోనే గత టీడీపీ పాలనలో చుక్క నీరు కూడా రాని బోరు బావుల్లో నేడు మూడించుల నీరు వస్తుండటం నిజం కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో యాడికిలో పూర్తయిన కాంప్లెక్స్‌లు మీరు ప్రారంభించక ఆ తప్పును ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై నెట్టడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో అల్లర్లు జరగటమే కాకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించేవారన్నారు. కాని మండలంలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ ఒక్క టీడీపీ కార్యకర్తపై కేసులు పెట్టలేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకేనేది లేదని టీడీపీ నాయకులను హెచ్చరించారు. నాయకులు శివప్రసాద్, హరీష్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే అజెండాగా పాలన

- అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు: పట్టణాభివృద్ధే ప్రధాన అజెండాగా పాలన సాగిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అజెండాను చదివి వినిపించారు. పట్టణంలో ఆగిపోయిన గ్రంథాయల భవనం పూర్తికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తిమ్మాపురం బావిని పునరుద్ధరించాలని తీర్మానించారు. భాగ్యనగర్, మోమినాబాద్, పాత గుంతకల్లులో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్ మరమ్మతు చేయాలని నిర్ణయించారు. దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మకాలనీలో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తమ వార్డులోని బుడగ జంగాల నివాస ప్రాంతంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే వైవీఆర్, కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లడంతో దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేసి సమస్య పరిష్కరించారని కౌన్సిలర్ లింగన్న తెలిపారు. పాతగుంతకల్లులోని వాల్మీకి సర్కిల్ నుంచి దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మకాలనీ వరకు రోడ్డు రూ.4 కోట్లతో రోడ్డు నిర్మాణం హర్షణీయమని, ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ కేవీ నాగలక్ష్మీ మాట్లాడుతూ జియో కంపెనీ చెందిన ఫోల్స్ ఏర్పాటుకు రోడ్లకు ఇరువైపులా గుంతలు తవ్వి వదిలేశారని సభ దృష్టికి తెచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇసుక తవ్వకంపై ఫిర్యాదు

శింగనమల: సలకంచెరువు రెవెన్యూ పొలంలోని కూతలేరు వంక సమీపంలో నున్న తమ పట్టా భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక తవ్వుతున్నారని రైతు బాలనరసింహారెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇసుక రవాణాదారులు వంకలతో పాటు పట్టా భూముల్లో ఇసుక తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



వివరాలు తెలుసుకుంటున్న ఓబులు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలు మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం–1లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మందులను ముందస్తుగా తెప్పించుకోవాలన్నారు. మలేరియా, డెంగీపై అడిగి తెలుసుకున్నారు. సబ్‌యూనిట్ సూపర్‌వైజర్ శ్రీధర్ మూర్తి, డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు సత్యనారాయణ శాస్త్రి, ధనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

పుట్లూరు: రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన పుట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ అనుహ్యారెడ్డి సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. గైడ్ టీచర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థినీ ట్రాఫిక్ ఫ్రీ విత్‌ఔట్ పొల్యూషన్ అనే అంశంపై వైఎస్సార్ కడపలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ప్రదర్శించిన ప్రాజెక్ట్ అందరినీ ఆకర్షించిందన్నారు. కాగా ఈ విద్యార్థినిని ఎస్ఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అభినందించి అవార్డును అందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గుంతకల్లు: మున్సిపల్ ఆప్కాస్ కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ ఎస్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. నాయకులు నరసయ్య, జగదీష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా రమణనాయక్



డాక్టర్.రమణనాయక్‌ను అభినందిస్తున్న వైద్యులు

శింగనమల: ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ మెంబరుగా స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్. రమణనాయక్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక గుంటూరులో జరిగింది. ఈసందర్భంగా సంఘం సభ్యులు అనంతపురం జిల్లా నుంచి ఆయన్ను రాష్ట్ర జనరల్ కౌన్సిల్ మెంబరు ఎన్నుకున్నారు. పలువురు వైద్యులు ఆయన్ను అభినందించారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

యల్లనూరు: కల్లూరు గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఉత్సవం వైభవంగా సాగింది. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయ అర్చకుడు ఆంజనేయులు రాతిదూలం లాగుడుపోటీలు ప్రారంభించారు. పోటీలు హోరాహోరీగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెక్క భజన, రాత్రి బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ ధరణీబాబు పర్యవేక్షించారు.

వజ్రోత్సవాలు జయప్రదం చేయండి

బుక్కరాయసముద్రం: ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ నాయకులు శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ జనవరి–12,13 తేదీల్లో కర్నూలులో వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు మృత్యుంజయుడు, నాగరాజు, వెంకటేష్, శ్రావణి, కొండమ్మ, సరస్వతి, అంజలి, బాబా పకృద్దీన్, సూర్యనారాయణ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకే పోటీలు



గుంతకల్లు మండలం పాతకొత్తచెరువులో కబడ్డీ ఆడుతున్న బాలికలు

యాడికి: క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో 12 జట్లకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఎంపీడీఓ, ఎంఈఓ కాశెప్ప, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి, పీఈటీ ఓబుళమ్మ, సచివాలయ సిబ్బంది పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

గుంతకల్లు రూరల్: తమ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసుకోవడానికి ఆడుదాం ఆంధ్రా పోటీలు మంచి వేదికగా ఉపయోగపడతాయని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నక్కనదొడ్డి గ్రామంలో ఆయన ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పోటీలు అనంతపురం జిల్లా వ్యాప్తంగా దిగ్విజయంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నెలగొండ, పాతకొత్తచెరువు, నక్కనదొడ్డిలో శుక్రవారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. క్రీడా పోటీల్లో యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పోటీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణప్ప సూచించారు.

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ జి.రవి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక అరబిందో పాఠశాలలోని క్రీడా మైదానంలో ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో క్రీడల పరంగా ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే తొలిసారన్నారు. ఈ పోటీలతో క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు.

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీయడం కోసం ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కబడ్డీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబులమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. డీఎల్‌డీఓ ఓబులమ్మ మర్తాడు, బూదేడులో పోటీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తు న్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: మండలంలో 13 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం శింగనమల, సలకంచెర్వు, తరిమెల, పెరవలి, సోదనపల్లి క్రీడా మైదానంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, పీడీలు, పీఈటీలు పర్యవేక్షించారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు

గార్లదిన్నె: అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతలను శుక్రవారం ముకుందాపురంలో గ్రామస్తులు ఊరేగించారు. అనంతరం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయానికి చేర్చి పూజలు చేశారు.